కథ

# గొడుగు!

**నారాయణ డి.వి.వి.ఎస్**

**"ఏమిటి ఒక్కరూ ఏం చేస్తున్నారు! వెన్నెల స్నానమా?"**

**మంచం మీద పడుకుని ఏదో ఆలోచిస్తూ ఆకాశంలోకి చూస్తున్న భరద్వాజ్ తలతిప్పి భార్యవైపు చూసి లేచి కూర్చున్నాడు.**

"నీ కోసమే ఎదురుచూస్తున్నాను" అన్నాడు.

"అదేం కాదు. ఈ ఐస్‌క్రీం కోసమని నాకు తెలుసు" అని నవ్వుతూ తెచ్చిన ఐస్‌క్రీం కప్‌ని భర్త చేతికి అందించింది సుమంతి.

"నువ్వు తెచ్చుకోలేదా?"

"శీతాకాలం, పైగా రాత్రి పది గంటలకి..అది కూడా డాబాపైన కూర్చుని ఐస్‌క్రీం తినడం..నా వల్లకాదు బాబు"

"ఈ థ్రిల్ నీకేం తెలుసోయ్! ఆనందించడానికేనా పెట్టి పుట్టాలోయ్!" అన్నాడు భరద్వాజ్.

"మీరు పుట్టారు కదా! తినండి. మీరు తింటే నేను తిన్నట్టే!" అని వెళ్ళబోయిందామె.

"కాసేపు కూర్చోవోయ్! ఎప్పుడూ పనేనా?" అన్నాడు చెయ్యి పట్టుకుని.

ఆమె సున్నితంగా విడిపించుకుని "సి.ఐ.గార్కి హుషారెక్కువగా వుంది. అవతల పెద్దబాబు వచ్చాడు. స్నానం చేస్తున్నాడు. భోజనం పెట్టాలి" అని అంది సుమంతి.

"పరీక్ష ఎలా రాసాట్ట!" అడిగాడు భరద్వాజ్ ఐస్‌క్రీం తింటూ.


"క్రిందకి వచ్చి మీరే వాడ్ని అడిగి తెలుసుకోండి. ఈ చలిగాలిలో మాత్రం ఎక్కువసేపు పడుకోకండి. జలుబు చేస్తుంది"


"సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంటే ఈజీగా తీసుకోకు. ఇది కసరత్తు బాడీ" అన్నాడు భరద్వాజ్ గర్వంగా.

"మరే..ఈ విషయం నాకు తెలుసు. కానీ మీ ముక్కుకి తెలియద్దూ" అని నవ్వుతూ వెళ్ళిపోయింది.

మరో పావుగంట తర్వాత భరద్వాజ్ క్రిందికి దిగాడు.

భరద్వాజ్ చేసేది పోలీస్ ఉద్యోగం అయినప్పటికీ చాలా హోమ్లీగా ప్రవర్తిస్తాడు. అతని ముఖంలోకాని, అలవాట్లలోకాని వృత్తికి సంబంధించిన లక్షణాలు కనిపించవు. తోటి ఉద్యోగస్తుల పట్ల, నేరస్తుల పట్ల కాఠిన్యాన్ని ప్రదర్శించడు. కానీ వృత్తిని దైవంలా భావిస్తాడు. విధి నిర్వహణలో వెనుకంజ వెయ్యడు. సమాజంలో పోలీసు విలువ పెరిగేలా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తాడు. అదే అతనికి మంచిపేరు తెచ్చిపెట్టింది.. హెడ్ కానిస్టేబుల్ నుండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి పెంచింది.





భోజనం పూర్తి చేసి చేయి తుడుచుకుంటున్న సంతోష్ తండ్రిని చూడగానే "నాన్నా! ఎప్పుడూ లేనిది మీరు ఖాళీగా కన్పిస్తున్నారు" అన్నాడు.

"జన్మానికో శివరాత్రి అన్నట్లు కాస్త రిలీఫ్ వచ్చిందిలే. రేపటినుండి మళ్ళీ కంటిమీద కునుకు ఉండదు. ముఖ్యమంత్రి గారి పర్యటన కదా! అది సరే నీ టెస్ట్ ఎలా రాసావో చెప్పు" అన్నాడు భరద్వాజ్ కొడుకుతో.

"రాయడం రిజల్ట్ సాయంత్రానికి నోటీసు బోర్డులో ప్రకటించడం కూడా జరిగింది. నేను సెలక్టయ్యాను నాన్నా" ఆనందంగా అన్నాడు సంతోష్.

"వెరీగుడ్. కంగ్రాట్స్. మరి ఇంటర్వ్యూ ఉన్నట్టుంది"

"ఐదవ తారీఖున నాన్నా"

"సరే బాగా ప్రిపేరవు" అని తన గదిలోనికి వెళ్ళబోయాడు భరద్వాజ్.

"నామినల్‌గా ఉంటుందిట"

"అలా అని నిర్లక్ష్యం చెయ్యకు. పోస్ట్‌లకు ఎంత మంది సెలక్టయ్యారు"

"పోస్ట్‌లు ఇరవై. రాత పరీక్షలో రెండు వందలమందికి డెబ్భైమందిమి సెలక్టయ్యాము"

"అంటే సుమారుగా వన్ ఈస్ టు ఫోర్. మరి పోటీ బాగానే ఉందిగా. నామినల్ అని ఎలా చెప్పగలవ్"

"అంటే..రికమండేషన్లు బాగా జరుగుతాయట"

"నీకెలా తెలుసు?"

సంతోష్ జవాబివ్వలేదు.

"ఈ తెలివితేటలకేం తక్కువ లేదు. అవన్నీ వదిలేసి ప్రిపరేషన్ సంగతి చూసుకో" అన్నాడు భరద్వాజ్.

"ఆ కంపెనీకి సుందరేశన్ అంకుల్ డైరక్టర్స్‌లో ఒకడు కదా..." సణుగుతున్నట్టు అన్నాడు సంతోష్.

"ఏ సుందరేశన్?" సందేహంగా అడిగాడు భరద్వాజ్.

"అర్నెల్ల క్రితం మనింటికి చాలాసార్లు వచ్చేవారు. ఈరోజు ఆయనని ఛాంబర్‌లో చూసాను కూడా. సెలక్షన్ లిస్ట్‌లో ఆయనే సైన్ చేశారు"

"ఇలాంటి విషయాలని వదిలేసి తెలివితేటల ద్వారా ఉద్యోగం సంపాదించుకోరా" అని మాట్లాడడానికి అవకాశం యివ్వకుండా భరద్వాజ్ తన రూమ్‌లోనికి వెళ్ళిపోయాడు.

☆ ☆ ☆

కొడుకుని ఇంటర్వ్యూకి పంపించి సుమంతి భర్త దగ్గరకు వచ్చింది. "ఏమండీ మీతో మాట్లాడాలి" అంది భర్త ప్రక్కన కూర్చుని.

"మాట్లాడు" అన్నాడు భరద్వాజ్ ఫైల్‌లోని పేపర్స్ చూసుకుంటూ.

"పెద్దబాబు జాబ్ గురించి"

"ఇందులో మనం మాట్లాడుకునేది ఏముంది? వాడికి ఉద్యోగం రావాలని నీ దేవుడికి ఎప్పటిలాగే మొరపెట్టుకో"

"మొర పెట్టుకోడానికే వచ్చాను"

"నాకర్థం కాలేదోయ్" ఫైల్ పక్కన పెట్టాడతను.

"నా దేవుడు మీరేగా"

"ఓహోహో..ఏమిటో నీ మొర?" నవ్వాడు భరద్వాజ్ చేతివాచ్ చూసుకుంటూ.

"టైమని చూడకండి. నా మాటమీద దృష్టి పెట్టండి"

"చెప్పుమరి"

"వాడు ఈ ఉద్యోగం మీద చాలా ఆశపెట్టుకున్నాడు"

"నీకూ నాకూ ఆ ఆశవుంది కదా!"

"ఆశవుంటే కుదరదు. అవకాశాన్ని గమనించుకోవద్దూ" ఆమె సాగదీసింది మాటల్ని.

"కాదన్నదెవరు? ఇంతకీ విషయం తేల్చు"

"పెద్దజీతం...విదేశాలకి వెళ్ళే ఛాన్సు..మంచి హోదా..ఎలాగైనా వాడికి ఈ ఉద్యోగం రావాలి. ఇది రాకపోతే వాడు అసలే ఉద్యోగం చెయ్యనని భీష్మించుకుని కూర్చున్నాడు"

"మంచిదే. వాడు స్వయంకృషితో వుద్యోగం తెచ్చుకోవాలి. వాడికి టాలెంట్ లేదా? అర్హతలు లేవా? వాడు కాస్త వుత్సాహం తెచ్చుకుంటే ఈ ఉద్యోగం వస్తుంది. నేనూ తండ్రిగా అదే కోరుకుంటున్నాను" అన్నాడు భరద్వాజ్.

"మీ నోటి చలవన వస్తే మంచిదే! కానీ ఈ రోజులు ఎలాంటివి? అన్ని అర్హతలున్నా కూడా రికమండేషన్‌కున్న విలువేమిటో తెలుసుకోవాలి మనం కూడా!"

"అంటే..సుందరేశన్‌ని నేను నా కొడుకుకి వుద్యోగం ఇమ్మని అడుక్కోవాలి. అంతేనా?" సీరియస్‌గా అన్నాడు భరద్వాజ్.

"అంత పెద్దమాటలొద్దండీ! కాస్త కోపం తెచ్చుకోకుండా ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ఆయన కంపెనీ భూముల్ని రౌడీషీటర్స్ ఆక్రమించుకున్నప్పుడు మీరు కాపాడి సాయపడ్డారు"

"తగ్గవోయ్ తగ్గు..అది నా డ్యూటీ"

"నిజమే...దానికి ఆయన థాంక్స్ చెప్పడం తప్ప ఏం ఇచ్చాడు. వాళ్ళకి కోట్ల విలువైన భూములు దక్కాయి"


"అది వాళ్ళకు న్యాయంగా దక్కాల్సిన ఆస్తి, దక్కింది"

"నిజమేనండి కాని మీ వల్ల వాళ్ళకి కోట్లు విలువచేసే ఆస్తి దక్కినప్పుడు అది మీ సక్రమమైన విధి నిర్వహణ వలన కదా జరిగింది. మీకు అవసరమైనప్పుడు సాయపడడం వాళ్ళ విధి కదా!"

"కాదు..కచ్చితంగా కాదు. ఇదిగో సుమా!

## ప్చ్! శ్రియ!!

హాలీవుడ్ మోజులో పడి ఇప్పుడు శ్రియ లేనిపోని సమస్యల్లో ఇరుక్కుంటోందిట. ఇంగ్లీషు సినిమా షూటింగ్‌లో బిజీ అయిపోయి తను ఇచ్చిన తమిళ సినిమాల డేట్లు అడ్జస్టు చేయలేక సతమతమవడమే కాదు, నిర్మాతల్ని ఇబ్బంది పెడుతోందని చెన్నయ్‌లో సినీజనాలు గగ్గోలు పెడుతున్నారు. ఇలాగయితే శ్రియపై యాక్షన్ తీసుకోవాల్సి వుంటుందని, తమకు జరిగిన నష్టానికి పరిహారం శ్రియ ఇవ్వాల్సి వుంటుందని తమిళ నిర్మాతలు డిమాండ్ చేసే అవకాశాలున్నాయట. ఇప్పటికైనా శ్రియ మేల్కొని ఎలాంటి గొడవలూ లేకుండా సమస్య పరిష్కరించుకుంటుందేమో!



నాకు ఇలాంటి మాటలు నచ్చవ్. నాకు చాలా పని వుంది. నువ్వెళ్ళు" కఠినంగా చెప్పాడు భరద్వాజ్.

ఆమె భర్త ముఖం చూసి మౌనంగా బయటికొచ్చింది. కొందరంతే! వీళ్ళు మారరు! అందరికీ సాయపడడమే కానీ స్వంతానికొచ్చేసరికి ఎందుకూ పనికి రారు. ఇంక ఆ దేవుని మీదే భారం. కొన్ని సమయాలలో నిట్టూర్పులే ఓదార్పులు.

☆☆☆

సంతోష్ ఇంటర్వ్యూ బాగానే చేశాడు. అడిగిన ప్రశ్నలకి అన్నిటిని ఆన్సరు చేశాడు. ఇంటర్వ్యూ చేసిన నలుగురిలో సుందరేశన్ కూడా ఉన్నాడు. సంతోష్ కొన్ని ప్రశ్నలకు తడబడుతూంటే "కన్‌ఫ్యూజ్ కాకుండా చెప్పు సంతోష్! నెర్వస్ కాకు. టైమ్ బార్ లేదు. థింక్ అండ్ గివ్ కరెక్ట్ ఆన్సర్" అని ప్రోత్సహించాడాయన. తండ్రికంటే ఆయనే నయం. సెలక్షన్ మాట ఎలా వున్నా కనీసం ప్రోత్సాహంగా మాట్లాడాడు.

సంతోష్‌కి తండ్రి అంటే ఎనలేని ప్రేమ! ఆయన మాట అంటే ఎంతో గౌరవం. తండ్రి నీతి, నిజాయితీ అతనికెంతో నచ్చుతాయి. కాని ఆయన ముందు మాట్లాడాలంటే ఏదో ఒక ఫీలింగ్! ఆయన ముందే కాదు చాలామంది ముందు అతను అలాగే ప్రవర్తిస్తాడు. మనసులో ఎన్ని భావాలున్నా బయటపెట్టలేడు. తెలియని ఆత్మన్యూనతా భావానికి లోనవుతాడు.

ఇప్పుడు జరిగిన ఇంటర్వ్యూలో కూడా అంతే! అన్నీ తెలిసిన ప్రశ్నలే! జవాబులు చెప్పాడు కూడా. కానీ ఫలితం గురించి ఆదుర్దా! ఎంత ప్రయత్నించినా కూడా కంట్రోల్ చేసుకోలేడు.

వారం రోజులు ఉద్యోగం గురించి ఆలోచనలతో గడిపి ఆ తర్వాత వదిలిపెట్టేశాడు. నెల రోజుల తర్వాత ఫలితం తెలిసింది.

☆☆☆

భరద్వాజ్ డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చాడు. సంతోష్ హుషారుగా తండ్రి ముందుకొచ్చాడు. "ఏమిటి సంతూ! ఏమిటి సంగతి?" కూర్చుంటూ అడిగాడు.

"అయ్ గాట్ సెలక్షన్" ఆనందంగా చెప్పాడు సంతోష్.

"వెరీగుడ్ కంగ్రాట్యులేషన్స్! నాకు తెలుసు నీకీ జాబ్ వస్తుందని. నీమీద నీ టాలెంట్ మీద నాకు నమ్మకం వుందిరా" అన్నాడు భరద్వాజ్.

"థాంక్స్ నాన్నా!"

"చూడు సంతూ! నువ్వు నాల్గు ఇంటర్వ్యూలలో ఓడిపోయావు. నువ్వు డిప్రెస్ అయ్యావు. కానీ ఓడిన ఆ నాలుగు ఇంటర్వ్యూల అనుభవమే నీకీసారి విజయం సాధించడానికి దోహదం చేసింది. అపజయాలు విజయానికి సోపానాలు. అది తెలుసుకోగలిగితే మన టాలెంట్స్ ఏమిటో మనకి తెలుస్తాయి. ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఇప్పుడు నీ సంగతి నీకు తెలిసింది కదా! ఇక మీదనైనా ధైర్యం పెంచుకుని అందరిలో కలిసిపో..ఓకే"

"అలాగే నాన్నా!" ఉత్సాహంగా అన్నాడు సంతోష్.

"మొత్తానికి మీరే నెగ్గారు" అంది సుమంతి భర్తకి స్వీటు అందిస్తూ.

☆☆☆

ఆ రాత్రి...

"మిమ్మల్ని అర్థం చేసుకోవడం కష్టం..ఏమాత్రం దొరకరు కదా!" సుమంతి భర్తతో అంది.

భరద్వాజ్ నవ్వి "నేను దొంగనా దొరకడానికి" అన్నాడు.

"అవును గజదొంగ. చేసిందంతా చేసి ఏమీ ఎరగనట్టు నటిస్తారు" నవ్విందామె.

"నేనేం చేసానోయ్" అర్థం కానట్లు ముఖం పెట్టాడు అతను.

"ఆ రోజు మీరు సుందరేశన్‌గారితో మాట్లాడినప్పుడు మీ మాటల్ని విన్నాను. బెడ్‌రూంలో సీక్రెట్‌గా సెల్‌లో మాట్లాడితే నాకు తెలీదనుకున్నారేం" అసలు విషయం బయటపెట్టింది సుమంతి.

"వంటతోపాటు గూఢచారి పని కూడా చేస్తున్నావే మిటోయ్ ఈమధ్య"

"పోలీసు భార్యని కదా! అంతా చేసి గుట్టుగా వుంటారేం! ఈ విషయం బాబుకి చెప్తే వాడు సంతోషిస్తాడు కదా!"

"కొంపతీసి విషయం వాడికి చెప్పేసావా?" అనుమానంగా అడిగాడతను.

"లేదండి. చెప్పేదాన్నయితే మీరు ఆయనతో ఫోన్లో మాట్లాడినప్పుడే విన్నానుగా..అప్పుడే చెప్పాలికదా!"

"మంచిది. వాడికి పొరపాటున కూడా తెలీనివ్వకు"

"ఈ బుర్రకి ఇంకా విషయం అర్థం కాలేదు"

భరద్వాజ్ నవ్వి అన్నాడు. "పిచ్చిమొగమా! నీ కొడుక్కి తనమీద తనకి నమ్మకం తక్కువ. దానివలన వాడి తెలివితేటలు మరుగున పడిపోతున్నాయి. వాడి తెలివి వల్లనే ఉద్యోగం వచ్చిందని వాడు అనుకోవాలి. లేదంటే వాడు ప్రతీ చిన్న విషయానికి ఇతరులపైనే ఆధారపడుతున్నాడు"

"నిజమేనండోయ్. నోరు విప్పి మాట్లాడడు. కాని ఎన్ని తెలివితేటలో వాడికి!" అందామె.

"మరేమిటనుకున్నావ్? జీవితంలో అవసరాలు వస్తాయి. అవి వర్షాల వంటివి. మరొక్కప్పుడు సమస్యలు ఎదురవుతాయి. అవి ఎండల వంటివి. పిల్లలకు తండ్రి గొడుగు వంటివాడు. ఎండల్లో, వానల్లో గొడుగు సాయం అవసరమైనట్లు తండ్రి పిల్లల అవసరాల్ని, సమస్యల్ని సమర్థవంతంగా అధిగమించడానికి సాయంగా నిలబడాలి. నేనూ తండ్రినే! నాలోనూ స్వార్థం వుంటుంది. కానీ అంతరాత్మ ప్రబోధంతో పనిచేసేవాడిని కనక సుందరేశన్ నాకు ఫోన్ చేసి వాడి గురించి మాట్లాడినప్పుడు 'నా కొడుకు టాలెంట్స్ మీద నాకు నమ్మకం వుంది. మీకు నమ్మకం కుదిరితే వాడికి సెలక్షన్ ఇవ్వండి' అన్నాను. నా వలన మాత్రమే వాడికి ఉద్యోగం వచ్చిందంటే అది నాకు సంతోషం అనిపించదు. వాడి విలువ వాడికి తెలియాలి కదా!"

సుమంతి ప్రేమగా భర్త కళ్ళలోకి చూస్తూ "నిజంగా మీరు దేవుడే" అంది.

☆



## మంచి భార్య జ్యోతిక

ఈమధ్య 'సిక్స్‌పాక్' గెటప్‌ని హీరోలు చాలామంది అనుసరిస్తున్నారు. తమిళ హీరో సూర్య కూడా ఓ తమిళ చిత్రం కోసం తెగ కష్టపడి సిక్స్‌ప్యాక్ అబ్స్‌తో నటించాట్ట. దీనికి అతడి భార్య-మాజీ హీరోయిన్ అయిన జ్యోతిక స్పందిస్తూ- 'మా పెళ్లయి రెండేళ్లవుతోంది. ఈ రెండేళ్లూ ఎంతో ఆనందంగా గడిచాయి. మా పాపకి ఏడాదిప్పుడు. చిన్న చిన్న మాటలు చెప్పేస్తోంది. సూర్య ఇలాంటి సిక్స్‌ప్యాక్‌లు గట్రాలు చేయడం నాకు సుతరామూ ఇష్టం లేదు. అతని కష్టం చూసి బాగా కోప్పడ్డాను కూడా' అని చెబుతూనే 'ఏం చేస్తాం, మా ప్రొఫెషన్‌ని బట్టి కొన్ని తిప్పలుంటాయి కదా' అని భర్తని సపోర్టు చేస్తోంది.